# పతి(వ్ర)తగా మార్చేదెవరు?

"ఇదిగో రాణాబాయ్! ఈసారి రేటు పెంచాల - అదే రేటిస్తే కుదర్దు. ఇలా ఒక్కో గుంటని మాయజేసి, వల్లో వేసి తీసుకురావాలంటే ఎన్ని పాట్లు పడాలో తెలుసా? పైగా ఎందరెందరికి ఎన్నెన్ని నైవేద్యాలో పెడితేగానీ ఒక్కోదాన్ని నీదాకా తేవడం అవదు. నీకేం ఇక్కడ కూర్చుని చక్కగా దానిమీద వందలూ, వేలూ గడించేస్తావ్" అంటూ రాణాబాయ్ ఎదుటకి ఓ అమ్మాయిని తోసి కళ్ళెగ్రజేస్తూ మరీ అడుగుతున్నాడు రషీద్.

"ఏమిటి రషీద్‌బాయీ! నువ్వనుకున్నంత తేలిగ్గా మేము గడించెయ్యడంలేదు. రెయిడ్లకొచ్చినప్పుడు, పోలీసోళ్ళకి మేము మాత్రం లంచాలివ్వటంలేదూ? మా పాట్లు మాకూ వున్నాయి" అంటూ రషీద్ చేతిలో మరో వెయ్యి రూపాయలు పెట్టి పంపేసింది.

రాత్రి కాలేజీ ఫంక్షన్ నుంచి యింటికెడుతున్న తనని నలుగురు గూండాలు చుట్టుముట్టి ముక్కు దగ్గర మత్తుమందు పెట్టి స్పృహ తప్పిపోతున్న తన్ని కారులో పడేసి ఎక్కడికి తీసుకెళ్ళేరో తెలీదు. స్పృహ వచ్చేసరికి తనో చీకటి గదిలో వున్నట్లు తెలిసి కేకలు పెట్టసాగింది. ఇంతలో ఒకతను వచ్చి ఏదో యింజక్షను బలవంతాన్న యివ్వగానే తల దిమ్మెక్కినట్లయింది. తరవాత తనని రషీద్ అన్నతను ఈ రాణాబాయ్‌కి అమ్మి డబ్బు తీసుకెళ్లాడు. మత్తుగా, తిమ్మిరిగా వుండటంవల్ల ఇల్లు వదిలి ఎన్నాళ్ళయిందోకూడా గుర్తురావడంలేదు. పూర్తిగా స్పృహ వచ్చాకే తనో వేశ్యాగృహంలో వున్నట్లు తెలిసింది. ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో వున్న ఆ పిల్ల కుళ్ళి కుళ్ళి ఏడవడం తప్ప ఏమీ చెయ్య లేకపోతోంది.

లేత పసిమి ఛాయలో నాజుగ్గా మెరుపు తీగలా వున్న ఆ పిల్లకి పాతికేళ్ళలోపే వుంటాయి. మంచి కుటుంబపు పిల్లలాగే వుంది.

గోడనంటిపెట్టుకు నిలబడి ఏడుస్తున్న ఆ పిల్లని చూడగానే రాణాబాయ్ మనస్సెందుకో చలించిపోయింది. లేత మల్లెమొగ్గలాగున్న ఆమె దగ్గరకెళ్ళి అక్కున జేర్చుకుంది. ఎందుకలా చేసిందో ఆమెకే తెలీదు. కొన్నేళ్ళుగా తన దగ్గరకి రషీద్‌వంటి బ్రోకర్లు వయసులో వున్న ఆడపిల్లల్ని తీసుకొచ్చి అమ్ముతూనే వున్నారు. ఎవరియందూ, ఎప్పుడూ ఇలా జాలీ, దయా తనకి కలగలేదు. అలాంటిదీనాడెందుకో ఈ పిల్లని చూస్తే మనసులో ఏదో తెలియని ఆవేదన అలజడి, సంఘర్షణ బయలుదేరాయి. తన వేశ్యాగృహాలకొచ్చే ప్రతీ ఒక్కరూ మొదట్లో యిలాగే ఏడుస్తారు. తరవాత పెంకితనంగా ప్రవర్తిస్తారు. మొండికేసి తిండి, నిద్ర మాని

కూర్చుంటారు. అల్లరి చేస్తారు. బ్రతిమాలతారు. అలాంటివాళ్ళని ఎలా లొంగదీసుకోవాలో తెలిసిన రాణాబాయ్ ఏ మాత్రం చలించకుండా వాళ్ళని వృత్తిలోకి దింపేది.

'కానీ ఈరోజేమిటి నేనిలా బేలగా తయారయి, ఆ అమ్మాయిపట్ల వచ్చిన క్షణం నుంచే అనురాగాన్ని పెంచేసుకున్నాను!?' అనుకుంటూ ఆ అమ్మాయిని తేరిపార చూసింది. మనసులో ఏదో కళుక్కుమంది. 'భగవాన్! అలా కాకూడదు' అని మనసులోనే దైవాన్ని ప్రార్థించింది.

కళ్ళెంలేని ఆలోచనల గుర్రం గిర్రున పాతికేళ్ళ వెనక్కి పరిగెత్తింది. తనకి అప్పుడిదే వయసుండి వుంటుంది. డిగ్రీ పూర్తిచెయ్యగానే తండ్రి తగిన సంబంధం చూసి పెళ్ళిచేసి అత్తవారింటికి పంపేడు. భర్త సేల్సు ఇంజినీరు. పెళ్లయిన కొత్తలో కూడా నెలకి పదిహేను రోజులు టూర్‌ల మీదే వుండేవాడు.

వారిది ఏ లోటూ లేని చక్కని సంసారం. భర్త అనురాగం, అప్యాయతలకి కొదువలేదు. కోరిన కోరికల్లా తీర్చే భర్త కావడంతో చిద్విలాసంగా, చిదానందంగా జీవితాన్ని సాగించేది. క్యాంపుల నుంచి రాగానే క్షణం తన్ని వదలకుండా "సుమా, సుమా!" అంటూ వెంటే వుండేవాడు. మరో రెండేళ్ళకి వారి అనురాగాల పంటగా చందనపు బొమ్మలాంటి కూతురు పుట్టింది. ఆ పాపని చూసి మురిసిపోతూ ఆ దంపతులు ఆమెకి 'చందన' అని పేరు పెట్టుకున్నారు.

సాయంకాలం క్యాంపు నుంచి రాబోయే భర్త రాక కోసం హాల్లో కూర్చుని గంటలు, నిమిషాలు లెక్కపెడుతున్న సుమతికి వీధిగేటు శబ్దం కావడంతో తొంగి చూసింది. యాదవ్ హడావిడిగా, వేళకాని వేళ రావడంతో ఆశ్చర్యంగా చూస్తూ లేచి వెళ్ళి తలుపు తీసింది.

"దీదీ! దీదీ! హరీష్‌కి ఏక్సిడెంట్ అయిందిట. అతని డైరీలో నా ఫోన్ నెంబరు వుండటంతో నా ఆఫీస్‌కి ఫోన్‌చేసి ఈ విషయం చెప్పారు. నిన్నూ తీసికెళ్దామని వచ్చాను. త్వరగా పద టేక్సీ రెండీగా వుంది" అంటూ తొందర చెయ్యడంతో గాబరాపడి పోతూ, కట్టలు తెంచుకు వస్తున్న కన్నీటిని ఆపుకుంటూ, పొరుగువారిని పిల్చి నిద్రపోతున్న చందనని చూస్తూ వుండమని తాళాలు యిచ్చి కొంత డబ్బు తీసుకుని యాదవ్ వెంట వెళ్ళింది.

టేక్సీ ఊరు దాటి వెళ్తూ వుండటంతో సుమతి అనుమానంగా యాదవ్‌ని చూసి "ఎక్కడున్నారాయన ఆసుపత్రిలో కాదా?" అన్నదానికి "ఊరి బయట ఏక్సిడెంట్ అయిందిట అక్కడికే వెళ్తున్నాం" అన్నాడు ముక్తసరిగా.

మరికొంతసేపటికి టేక్సీ ఊరికి దూరంగా వున్న ఓ ఇంటి ముందాగింది. "దిగు దీదీ! నేను టేక్సీకి డబ్బిచ్చి వస్తా. నువ్వు పద" అంటూ తలుపు తీసిన యాదవ్‌వైపు భయం భయంగా చూస్తూనే టేక్సీ దిగి లోపలికెళ్ళిన తనని నలుగురు వస్తాదుల్లాంటివాళ్ళు రెక్కలు పుచ్చుకుని ఈడ్చుకెళ్ళి మత్తుమందు ముక్కు దగ్గరపెట్టి మైకం కమ్ముతుండగా ఓ గదిలో పడేశారు.

తెలివి వచ్చి చూసేసరికి తనొక వేశ్యాగృహంలో వుండటంతో గుండె చెరువయ్యేలా ఏడుస్తూ యజమానురాలిని బ్రతిమాలసాగింది. తన గురించి చెప్పి, భర్త స్నేహితుడే తన్నిలా మోసగించి తీసుకొచ్చాడని, నెలల బిడ్డనొదిలి వచ్చానని కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమాలసాగింది.

తన గోలంతా పెడచెవిని పెట్టి, ఏ మాత్రం చలించకుండా ఆ ముసలి భోగంది తన పేరు రాణాబాయ్‌గా మార్చి నిర్దయగా వేశ్యావృత్తిలోకి దింపింది. ఏడ్చి, గోలపెట్టినప్పుడు కొట్టి, వాతలెట్టడానికి కూడా వెనకాడేది కాదు ఆ నిర్దయామయురాలు. కొన్నాళ్లపాటు కుళ్ళి కృశించిపోయేలా ఏడుస్తూ కూర్చునేది. అప్పుడప్పుడు భర్త, పిల్ల, సంసారం, తల్లీ, తండ్రీ, తోబుట్టువులు గుర్తొచ్చి గుండె బద్దలయ్యేలా రోదించి, ఊరడించే దిక్కులేక నోరు మూసుకునేది. మొదట్లో ఆ పాశం నుంచి బైటపడాలని ఎంతో ప్రయత్నించేది. జైలు నుంచి బయటపడటం సులువేమో కానీ వేశ్యాగృహం నుంచి బైటపడటం మాత్రం దుర్లభమని తెలుసుకుంది. ఆత్మహత్య చేసుకోవాలన్నా విషం కూడా దొరకనివ్వలేదు. రోజూ రాత్రులు పరాయి మగవారి పక్కన యమలోకాన్ని రుచి చూసినప్పుడు, భర్తతో రాత్రులు గడిపిన మధుర క్షణాలు గుర్తొచ్చి గిలగిల్లాడిపోయేది. నిస్సహాయ స్థితిలో పరాధీనయైన తనని వారిచ్చే డబ్బుకి రెట్టింపు బాధల్ని పెట్టి, పుట్టెడు రోగాలని అంటగట్టేవారు. దిక్కులేని తను రాను రాను ఆ జీవితానికి అలవాటుపడిపోయింది. ఫలితంగా నలభై అయిదేళ్ళకే ముసలిరూపం రాగా, తనింకెవరికీ పనికిరాకపోవడంతో యజమానురాలు "నీ దారి నువ్వు చూసుకో!" అంటూ తరిమేసింది.

మరో దారి గోచరించని రాణాబాయ్ పాత జీవితాన్ని మర్చిపోయి భుక్తికోసం అయిదారేళ్ళుగా తనే ఓ వేశ్యాగృహాన్ని నడుపుతూ రషీద్ వంటి బ్రోకర్లు తెచ్చే అమ్మాయిల్ని బలవంతాన్ని కొట్టి, తిట్టి వృత్తిలోకి దింపి జీవనోపాధికి డబ్బు గడిస్తోంది.

పాత జ్ఞాపకాల లోకం నుంచి బైటపడిన రాణాబాయ్ ఆ అమ్మాయిని పిల్చి "నీ పేరేమిట"ని అడగినదానికి "మోహిని" అని వెక్కుతూ చెప్పింది. "అసలు పేరా? లేక రషీద్ పెట్టిందా?" అని అడగ్గానే "వాడు పెట్టిందే!" అని చెప్పగానే "అయితే నీ అసలు పేరేమిట"ని అడగ్గానే "చందన" అని చెప్పగానే షాక్ కొట్టినట్లయి ఆ పిల్ల ముఖంలోకి సూటిగా చూసింది. ఎక్కడో తన బిడ్డ చందన పోలికలు కనబడుతున్నాయి. "ఏ ఊరు తల్లీ! మీది" అని రాణాబాయ్ చందన తల నిమురుతూ అడిగినదానికి "ఢిల్లీ" అని అనగానే "ఆఁ!!" అంటూ పిచ్చిదానిలా చందనవైపు చూసింది. తనని చూసి ఆశ్చర్యపోతున్న చందనని చూసి తన తొట్రుపాటుని సర్దుకుంటూ "భయపడకు తల్లీ! నిన్ను మీ ఊళ్ళో మీ ఇంటి దగ్గర దింపి వస్తాను" అన్న మాటలకి ఆనందం, దుఃఖం పట్టలేక "నిజంగానా అమ్మా!" అంటూ ఆమెని కౌగిలించుకుని ఏడుస్తున్న చందనని దగ్గరగా తీసుకుని, తల పక్కకి తిప్పి చందనకి కనబడకుండా కళ్ళనీళ్ళు తుడుచుకుంది రాణాబాయ్. 'తాను చెడిపోయినా తన బిడ్డని ఏ తల్లీ చెడిపోనివ్వదమ్మా!' అని మనసులోనే అనుకుంటూ ఆమెని లోపలికి తీసికెళ్ళింది రాణాబాయ్.

చందనతో రైల్వేస్టేషన్‌కొచ్చిన రాణాబాయ్ ఢిల్లీ వెళ్ళే రైలు రాకకోసం ఎదురుచూడటం లేదు. 'రైలు రాకుండా వుంటే చందన మరికొంచెం సేపు నా వద్ద నా ఎదురుగా వుంటుంది. సుమారు పాతికేళ్ళ తరవాత నా బిడ్డ అనుకోని పరిస్థితుల్లో నా యింటికొచ్చింది. ఎన్నాళ్ళకి నా బిడ్డని చూసుకున్నాను. అదృష్టవశాత్తూ రషీద్ చందనని నా యింటికి తీసుకొచ్చాడు. ఒకవేళ వేరే వేశ్యాగృహానికిగానీ చందనని అమ్మేసివుంటే?!' అన్న ఆలోచన రాగానే "అమ్మో!!" అని కేకలేసి గుండెలమీద చెయ్యి వేసుకున్న రాణాబాయ్‌ని ఆశ్చర్యంగా చూసి "ఏమయిందమ్మా!" అని చందన అడిగేదాకా తన ఆలోచనా భావాలని పైకి వ్యక్తం చేసినట్లు తెలుసుకోలేదు. "ఏం లేదమ్మా! ఏదో కుట్టింది" అని సర్దుకుని మళ్ళీ ఆలోచనా తరంగాల్లో కలిసిపోయింది.

హరీష్ ఎలాగున్నాడో? మళ్ళీ వివాహం చేసుకున్నాడా? నా గురించి ఏమనుకున్నాడు? స్నేహితుడే తన భార్యని మోసం చేశాడని తెలిసిందా? ఎలా తెలుస్తుంది?? పొరుగువారు చూసివుంటే తను యాదవ్‌తో వెళ్ళినట్లు చెప్పి వుంటారు! ఓ పార్టీలో పరిచయమైన యాదవ్ నెమ్మది, నమ్రత చూసి హరీష్‌కి అతనంటే అభిమానమేర్పడింది. దాంతో అప్పుడప్పుడు ఇంటికొచ్చి తమతో గడిపేవాడు. అలా అలా ఇంట్లో సొంత వ్యక్తిలా మసలసాగాడు. అంటే యాదవ్ అసలు రూపం అదన్నమాట! నమ్మకద్రోహి - 'దీదీ! దీదీ! అని పిలుస్తూనే ఎంత దగా చేశాడు!

"రైలొచ్చేస్తోంది లేవండి!" అన్న చందన మాటలకి రాణాబాయ్ ఆలోచనల్లోంచి తేరుకుని పెట్టె తీసుకుని ప్లాట్‌ఫారమ్‌వైపు నడవసాగింది.

రైలు కదిలింది. చందనలో ఉత్సాహం చూస్తుంటే మనసులో కోటాను కోట్ల ఆలోచనలు దూమారంలా లేవసాగాయి. చందన తిరిగి ఆ యింట అడుగెట్టినట్లు తాను పెట్టగలదా?

పాతికేళ్ళ క్రితం వదిలేసి వచ్చిన ఆ యిల్లు "నాదీ" అని ఎలా అనగలదు?? అన్నా లోకం హర్షిస్తుందా? హరీష్ భార్యగా స్వీకరిస్తాడా? అంతెందుకు - ఇంత అమాయకంగా వున్న చందన నిజాన్ని తెలుసుకుంటే నన్ను "అమ్మా!" అని పిలుస్తుందా? తన్ని వేశ్యాగృహం నుంచి తప్పించి యింటికి తీసుకువెళ్తున్నానన్న గౌరవంతో "అమ్మా!" అని సంబోధిస్తోంది. నిజం తెలిస్తే అసహ్యించు కోదూ!!

అయినా యిప్పుడు చందనని దింపడానికి నేనే బయలుదేరి ఎందుకు వెళ్తున్నాను? ఒక్కసారి నా యిల్లు, నా భర్త అనుకున్నవి చూడాలనిపించి కాదా? హరీష్ గురించి చందనని అడిగితే! అమ్మో! చందనకి నిజం తెలిసిపోతే??

వద్దు- వద్దు- ఇంక ఈ నా దుర్భర జీవితం యిలాగే అంతం కావాలి. నిజాన్ని ఎవరికీ చెప్పకూడదు. ఛీ! ఎంత నీచమైన బ్రతుకు! ఎంత దైన్యస్థితి!!

ఈ వయసులో భర్త అండన, పిల్లల మధ్య నా సంసారం, నా యిల్లు అంటూ ఎంతో

ఆనందంగా జీవితాన్ని గడపవలసిన నేను యాభై ఏళ్ళకే వయసుకి మించిన ముసలి రూపంతో, పుట్టెడు రోగాలతో దొంగచాటుగా బ్రతుకుతున్నాను. ఏనాడు చేసుకున్న పాపమో?! అనుకుంటూ చందనవైపు చూసింది.

బెర్తుకి ఆనుకుని నిద్రపోతున్న ఆ లేత ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోంది. వచ్చినప్పుడున్న భయం, ఆందోళన ఏ కోశాన్నా ఆమె ముఖంలో కానరావటంలేదు. నిర్భయంగా, నిర్విచారంగా నిద్రపోతున్న చందనని ఆప్యాయంగా తడిమి తనూ మేనువాల్చింది రాణాబాయ్.

రాత్రి దిగిన రాణాబాయ్, చందనలు తిన్నగా హెటల్‌కి వెళ్ళి రూం తీసుకుని పడుకున్నారు. మర్నాడుదయం లేచి స్నానం, టిఫిను ముగించి ఆటో ఎక్కి చందన చెప్పిన గుర్తుల ప్రకారం వారి సొంత ఇంటి ముందు ఆటో ఆపించి చందన తల నిమిరి, ముద్దాడి లోపలికెళ్ళమని చెప్పింది.

"ఒక్కసారి మీరూ లోపలికి రండమ్మా!" అని చందన బ్రతిమాలుతున్నా వినిపించు కోకుండా ఆటోని తిరిగి హెటల్‌కి పోనివ్వమంది. పెల్లుబుక్కొస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక, బరువెక్కిన హృదయంతో 'మళ్ళీ బిడ్డని చూడగలనా?' అనుకుంటూ కన్నీటి పొరల మసకలో లీలగా కనిపిస్తున్న చందనని వెనుదిరిగి చూసుకుంటూ కళ్ళొత్తుకోసాగింది రాణాబాయ్.

మర్నాటి ప్రయాణానికి టిక్కట్టు కొనుక్కుని రూంకొచ్చి మంచం మీద నడుంవాల్చిన రాణాబాయ్‌లో ఏదో తృప్తి. ఆనందంతో మనసంతా తేలిపోతున్నట్లుంది. మరోపక్క చందనని, ఆ ఇంటిని చూశాకే 'వారి ఆప్యాయతా, అనురాగాలకి దూరమైన దౌర్భాగ్యురాలిని అయ్యాను కదా! "నా" అన్నవాటిని అన్నింటినీ పోగొట్టుకున్న నిర్భాగ్యురాలినయ్యాను. ఏకాకిలా ఈ హీనమైన బ్రతుకు యింకా ఎన్నాళ్లు సాగించాలి భగవాన్!' అనుకుంటూ గుండెల్లోని బరువు దింపుకోడానికి ప్రయత్నించసాగింది రాణాబాయ్.

సామాను తీసుకుని రైల్వేస్టేషన్‌కి బయలుదేరుతున్న రాణాబాయ్ రూం తలుపు తట్టిన శబ్దం కావడంతో వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా చందన, హరీష్‌లని చూసి స్తబ్దులా నిలబడిపోయింది.

"రాణాబాయ్‌గారూ! నా బిడ్డని మా యింటికి తీసుకొచ్చి అప్పగించిన మీకు ధన్యవాదాలు చెప్పుకోడానికి వచ్చాను. ఈ రోజు ఊరినుంచి రాగానే చందన విషయమంతా చెప్పింది. నరకకూపం నుంచి నా బిడ్డని రక్షించి మళ్ళీ దానికి కొత్త జీవితాన్నిచ్చారు. మీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలీటం లేదు. అంటూ ఆమె చేతులు పట్టుకుని తన ఆనందాన్ని వెలిబుచ్చుతున్న హరీష్‌ని చూసి తల దించుకుంది రాణాబాయ్.

వయసు తెచ్చిన మార్పులవల్ల హరీష్ బాగా మారిపోయాడు. జుట్టంతా తెల్లబడింది. బాగా చిక్కినట్లున్నాడు. 'చందనతో వచ్చి వుండకపోతే నేను గుర్తుపట్టలేకపోదునేమో!' అనుకుంది మనసులోనే.

నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ తిరిగి హరీష్ "రాణాబాయ్ గారూ! నా ఒక్క కోరికని మన్నించగలరా! మీకూ "నా" అన్నవారెవరూ వున్నట్లు లేదు. నాకా ఇంట్లో ఆడదిక్కు లేదు. నా బిడ్డని చూసుకునే దక్షత లేక నేనూ బాధపడుతున్నాను. మీరా లోటు తీర్చగలనంటే జన్మజన్మలకీ మీకు రుణపడి వుంటాను. మళ్ళీ ఇలాంటి ఆపద రాకుండా నా యింట్లో వుండి మీరు చందనని చూసుకుంటానంటే మీకు ఎంత జీతం కావాలన్నా యిస్తాను. నా బిడ్డకో ఆడదిక్కు కావాలి, కాదనకండి" అంటూ ప్రతిమాలుతున్న హరీష్‌ని చూసి, పోగొట్టుకున్న పెన్నిధి, మళ్ళీ దొరకదనుకున్న స్వర్గం తనకి దక్కబోతోందన్న ఆనందాన్ని మనసులోనే అదిమిపట్టి "నేను ఊరికి వెళ్ళి కొన్ని పన్లు చూసుకుని త్వరలోనే తిరిగి వస్తాను" అన్న మాటలకి హరీష్ ఆనందం పట్టలేక చందనని కౌగలించుకుని "తల్లీ! నీకు యిన్నాళ్ళకి తగిన రక్షణ కలిగించ గలిగానమ్మా! నీకింక భయం లేదు. నేనెక్కడికెళ్ళినా వంటరిగా వున్నావన్న దిగులుండదు కన్నా!" అంటూ తల నిమిరి రాణాబాయ్‌ని స్టేషన్‌లో దింపి తృప్తిగా ఇంటికి వస్తున్న హరీష్ మనసు 'పిచ్చి సుమ తన్ని గుర్తుపట్టలేదనుకుంది. తనకి జరిగిన అన్యాయం నాకు తెలీ దనుకుంది. భార్యాభర్తలు అంటే దాంపత్య జీవితమే ముఖ్యమా? సుమకీ వయసులో తోడూ, నీడా కావాలి. నాకూ సుమ తోడు కావాలి. చందనకి తల్లి ప్రేమ, అండ ముఖ్యంగా కావాలి. ఇలా నాటక మాడకపోతే సుమ తిరిగి ఈ ఇంటికి రాదు. ఎంత పట్టుదల, పౌరుషంగల మనిషో రెండేళ్ళ కాలంలోనే గ్రహించగలిగాను' అనుకున్నాడు.

ఎన్నడూ చూడని ఆనందం తండ్రిలో ఈ రోజు కొట్టొచ్చినట్లు కనబడుతున్న చందనకి, తండ్రి ఇంత సంతోషంగా ఎందుకున్నాడో అర్థంకాక ఖిన్నురాలై అతన్నే చూడసాగింది.

**- స్వాతి సపరివార పత్రిక 20-4-1990**